క్లుప్తంగా

బీట్ అధికారికి పురస్కారం



మంత్రి పెద్దిరెడ్డి నుంచి పురస్కారం అందుకుంటున్న రోశయ్య

మార్కాపురం: అటవీ శాఖ పరిధి గంజివారిపల్లి రేంజ్ రేగుమానిపెంట బీట్ అధికారి నాగం రోశయ్యకు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిభా పురస్కారం అందించి సన్మానించారు. రోశయ్య తన పరిధిలోని అటవీ ప్రాంతంలో పులుల జాడ గుర్తిస్తూ, వాటి కదలికలను పరిశీలిస్తూ, పులుల ఆవాసాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సంరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఆయన్ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని రోశయ్య తెలిపారు. డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్, రేంజ్ ఆఫీసర్ సుబ్బారావులు రోశయ్యను అభినందించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: మండలంలోని మాదాలవారి పాలెంలో ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జ హాన్ బేగం తెలిపారు. కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలి కోరారు.

జగనన్న సురక్షపై సర్వే పూర్తి చేయాలి

పుల్లలచెరువు: ఇటీవల మండలంలోని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారని, సచివాలయాల పరిధిలో అందుబాటులో లేని ఇళ్ల వివరాలపై గ్రామ వలంటీర్లు సర్వే పూర్తి చేయాలని ఈవోఆర్డీ బాలునాయక్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ప్రభుత్వ పథకాలు అందకుండా ఉండిపోయిన వారి వివరాలు సేకరించి మళ్లీ పథకాలు అందేలా నివేదికలు తయారు చేసి సోమవారంలోపు ఇవ్వాలని బాలునాయక్ కోరారు. ఈ విషయంలో వలంటీర్లు అశ్రద్ధ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని, పంచాయతీ కార్యదర్శులు కూడా వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నివేదికలు అందేలా చూడాలన్నారు.

బైక్ మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

కంభం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బైక్ మెకానిక్ షేక్ సుభానీ కుటుంబానికి నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల టూవీలర్ మెకానిక్‌ల అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ అసోసియేషన్ ఫౌండర్ ఎస్‌కే సుభానీ ఆదేశాల మేరకు అందరి సహకారంతో ఈ సాయం చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ స్థాపించినప్పటి నుంచి ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా వారికి అండగా ఉంటున్నట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు రసూల్, చాంద్‌బాషా, కృష్ణారెడ్డి, సిలార్, నాసర్ వలి, హనుమయ్య, బైక్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

అటవీ జంతువులను సంరక్షించాలి

గిద్దలూరు రూరల్: అటవీ ప్రాంతంలో నివసించే జంతువులను సంరక్షించుకోవాలని గిద్దలూరు ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ హెచ్.జీవన్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలంలోని దిగువమెట్ట గ్రామంలో అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అటవీ ప్రాంతంలో నివసించే ప్రతి జంతువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతేగాక అటవీ ప్రాంతంలో సంచరించే పులులను ప్రత్యేక నిఘా ఉందన్నారు. అనంతరం అటవీశాఖ అధికారులతో దిగువమెట్ట రేంజి పరిధిలో అవగాహన కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు వంశీకృష్ణ, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

గిద్దలూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగలంతా అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి చిలక కిరణ్‌మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంయూఎఫ్ సభ్యులతో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గుర్రం బాబూరావు అధ్యక్షతన శనివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వర్గీకరణ సాధించే బాటలో ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో 30 లక్షలతో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు పులుగుజ్జు ఫ్రాంక్లిన్ మాదిగ, మాదిగ ఉద్యోగ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్ మాదిగ, కొండేపోగు దేవప్రభాకర్, ప్రసాద్, కత్తి అనోజీరావు, పానుగంటి ఇశ్రాయేలు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మార్కాపురం: పగలు ఉత్సవంలో గొర్లగడ్డ పీర్లు



మార్కాపురం: రాత్రి చాందిరిలో గొర్లగడ్డ పీర్ల ఊరేగింపు



రాచర్ల: అనుమలవీడులో పీర్లకు ముడుపులు కడుతున్న మహిళలు

కులమతాలకు అతీతంగా మొహర్రం



మార్కాపురం రూరల్: దర్గాలో కొలువై ఉన్న పీర్లు



మార్కాపురం: ఊరేగింపులో తూర్పువీధి పీర్లు



తర్లుపాడు: తుమ్మలచెరువులో ఊరేగుతున్న పీర్లు



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కురిచేడు: మొహర్రం పర్వదినాన్ని కులమతాలకు అతీతంగా నిర్వహించుకున్నారు. మండలంలోని కల్లూరు, పడమరనాయుడుపాలెం, పొట్లపాడు, కురిచేడు గ్రామాల్లో ఈ పర్వదినాన్ని నిర్వహించారు. శుక్రవారం రాత్రి పెద్ద షెరగత్ నిర్వహించారు. యువకులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ భక్తిని చాటుకున్నారు. శనివారం రాత్రి గ్రామంలోని నాలుగు చావిడీల పీర్లు బస్టాండు సెంటరులో సలాం అందుకోవటం అందరినీ ఆకర్షించే ఘట్టం. అనంతరం రైల్వే స్టేషను వద్ద ఉన్న చెరువు వరకు గ్రామోత్సవం చేసి పీర్లను అంతర్ధానం చేస్తారు.

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం ఇడుపూరులో మొహర్రం పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పీర్లచావిడి దగ్గర పీర్లకు నైవేద్యం, గంధం, కొబ్బరిగిన్నెలు, దట్టీలు, పూలమాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పీర్లను ఊరేగించారు. గ్రామ సర్పంచ్ వెన్న మహేశ్వరీ సుబ్బారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం

దొనకొండ: మండలంలోని చందవరం, ఇండ్లచెరువు, బాదాపురం, ఎస్ఎస్‌పల్లి, కొచ్చెర్లకోట గ్రామాల్లో గ్రామస్తులు కుల, మత, వర్గ విభేదాలు లేకుండా మొహర్రం సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు చుట్టు పక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి పెద్ద సరిగెత్తు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పీర్లకు నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం పీర్లు పుర వీధులలో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో పెద్ద షరిగత్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో కొలువై వున్న పెద్ద ఖాశీం, చిన్న ఖాశీం తదితర పీర్లను పుష్పాలు, దట్టీలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటారు. డప్పులు, వాయిద్యాలతో గ్రామస్తులు దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి స్వామివార్లకు నైవేద్యం సమర్పించారు. ఇమామే ఖాశీం వంశీయుల త్యాగనిరతకి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలు ముస్లింలు, హిందువులు కలిసి భక్తిశ్రద్ధలతో అనాదిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో తుమ్మలచెరువు గ్రామం బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల రాకతో కిటకిటలాడింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముజావర్ల ప్రత్యేక ప్రార్థనల అనంతరం గ్రామోత్సవం ప్రారంభమైంది. ఇంటి వద్దకు వచ్చిన పీర్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దర్గా కమిటీ వారు మంచినీరు, ఫలహారం ఏర్పాటు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు హాజరై మొక్కులు తీర్చుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం తర్లుపాడు, కలుజువ్వలపాడు, పోతలపాడు, గానుగపెంట, గోరుగుంతలపాడు గ్రామాల్లో కూడా మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

మార్కాపురం టౌన్: పవిత్ర మొహర్రం పండగను పురస్కరించుకుని పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని పట్టణంలో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇస్లాం, ధర్మ పరిరక్షణ కోసం అశువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ముస్లింలు ఉపవాస దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు, దువాలు నిర్వహించారు. పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధి, కాలువకట్ట, కొండారెడ్డి కాలనీ, విజయటాకీస్ తదితర పీర్లచావిడిలో పీర్లను తీసి గుండంలో నడుచుకుంటు వెళ్లారు. పీర్లకు దట్టీలు, పూలతో అలంకరించిన గుమ్మటాలు తొడిగి వివిధ వెండి గొడుగులు, ఊయలలు, కర్ణాభరణాలు, నాగాభరణాలు అలంకరించారు. భక్తులు పీర్లకు వారు పోసి బొరుగులు, పప్పులు, బెల్లం సమర్పించారు. ముజావర్లు పీర్లను ఎత్తుకుని భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. భక్తులు గుండంలో కొబ్బరి కాల్చారు. చాందిరిల్లో పీర్లను ఉంచి పట్టణ పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముజావర్లు, మత పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు గ్రామంలో మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం పెద్ద సరిగెత్తు గ్రామోత్సవం సందర్భంగా పీర్లను ఊరేగింపు నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు సందర్భంగా ప్రజలు హారతులతో పీర్లకు స్వాగతం పలికారు. పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజుపాటి పెద బ్రహ్మం, చాంద్‌బాషా, రావిపాటి మీరావలి, రావిపాటి ఖాశిం, భక్తులు పాల్గొన్నారు.

రాచర్ల: కులమతాలకు అతీతంగా జరుపుకోనే మొహర్రం పండుగ వేడుకలు, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మొహర్రం పండుగ సందర్భంగా పీర్లచావిడిల్లో భక్తులతో శనివారం కిటకిటలాడాయి. షహదత్ (పీర్ల పండగ) చివరి రోజు కావడంతో ఆకవీడు, అనుమలవీడు, పాలకవీడు, ఆరవీటికోట, పలుగుంటిపల్లె గ్రామాల ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకుకున్నారు. గ్రామాల్లోని పీర్లచావడిల్లో ఏర్పాటు చేసిన పీర్లను పూలమాలలతో అలంకరించి ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారు జామున ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంగా సాగిన పీర్లను భక్తులు ప్రార్థనలు చేసి తమభక్తిని చాటుకున్నారు. అనంతరం (మేవా) ప్రసాదం తీసుకున్నారు. మొక్కుబడి కలిగిన పలువురు భక్తులు పీర్లకు వెండితో తయారు చేసిన ఆభరణాలు సమర్పించారు.

నేత్రపర్వంగా పీర్ల గ్రామోత్సవం

కంభం: మొహర్రం పండుగ సందర్భంగా మండలంలోని హజరత్‌గూడెంలో పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. పీర్లచావిడిల్లో అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పొదిలి: త్యాగాలకు ప్రతీకగా భావించే మొహర్రం పండగ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పీర్ల మిలాఖత్ ఉత్సవం పాతూరులోని ప్రధాన రహదారిలో జరిగింది. తూర్పుపాలెం, పడమరపాలెం, విశ్వనాధపురంలోని పీర్లు ఊరేగింపు ఉత్సవం చేసుకుంటూ మిలాఖత్ వద్దకు చేరాయి. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, యువకుల నృత్యాల మధ్య ఉత్సవం జరిగింది. భక్తులు పీర్లు మిలాఖత్ వేళ బొరుగులు, తమలపాకులు చల్లుతూ తమ భక్తిని చాటుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జున బందోబస్తు ఏర్పాటు చేశారు.



కంభం: హజరత్‌గూడెంలో పీర్లను తిలకించేందుకు వచ్చిన భక్తులు



పులిపాడులో పీర్లను ఊరేగిస్తున్న చిన్నారులు



చందవరంలో పీర్లు ఊరేగిస్తున్న గ్రామస్తులు



కురిచేడులో పీర్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- కటకానిపల్లిలో నూరవ రోజు కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం
- మంత్రికి అడుగడుగునా ఘన స్వాగతం పలికిన కటకానిపల్లి గ్రామ వాసులు

పెద్దదోర్నాల: అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కటకానిపల్లిలో శనివారం నూరో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన, వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే అందించటం హర్షణీయమని కొనియాడారు. పేదరికాన్ని రూపు మాపేందుకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల చేయూతతో ప్రతి పేదవాడు ఆర్థికంగా బలోపేతం అయ్యారని



మంత్రి సురేష్‌కు హారతి ఇచ్చి దీవెనలు అందిస్తున్న వృద్ధురాలు

చెప్పారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. ప్రతి ఇంటివారు రెండు మూడు పథకాలు లబ్ధి పొందామని ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని మంత్రి వారికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిక్కిలి కోటిలింగం, డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీవో విజయ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ డైరక్టర్ దూదేకుల ఖాశింపీరా, ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్, జెడ్పీటీసీ సభ్యులు దుమావత్ లతాచంద్రకాంత్ నాయక్, మాజీ సర్పంచ్ సీతయ్య, నలబోతుల వెంకటేశ్వర్లు, పిక్కిలి కాశిరావు, దండా సుబ్బారెడ్డి, రవి, ముసలారెడ్డి, వెలిదండ నాగేశ్వరరావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి

ముండ్లమూరు: మహిళలు వృత్తి నైపుణ్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని జన శిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ కే శ్యామ్ సునీల్ అన్నారు. మండలంలోని ఈదర గ్రామంలో హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకింగ్‌పై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ మహిళల అభివృద్ధి కోసం వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారన్నారు. తద్వారా చేతి వృత్తుల ద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, ట్రైనర్ సుశీల, సువర్ణరాజ్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

యర్రగొండపాలెం: మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌తో పాటు పశ్చిమ బెంగాల్లోని మాల్దా జిల్లాలో మహిళలపై దారుణమైన ఘటనలు జరుగుతున్నాయని, దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు బట్టపోతుల వెంకటేశ్వర్లు, బంగ్లా సుబ్బయ్య, ఎడవల్లి రామయ్య, మోటుకూరి వెంకటేశ్వర్లు, బత్తుల కాటమరాజు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పొదిలి మండలం మాదాలవారిపాలెం సచివాలయం పరిధి నందిపాలెంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరో మారు ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు.

బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

గడప గడపకు వచ్చిన అధికారులు, నాయకులుకు స్థానిక నాయకులు దోర్నాల చిన నారాయణరెడ్డి, కసుబుద్ది రమణారెడ్డి, దోర్నాల రమణారెడ్డి, పులుసు వెంకటేశ్వరరెడ్డి, పోతురాజు శ్రీనివాసులు,



నందిపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

గజ్జా అనిల్‌బాబు, పొదిలి ఏడుకొండలు, దొడ్డా శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బాణసంచా కాల్చుతూ డప్పుల సందడితో శాలువాలు కప్పి పూలతో స్వాగతం పలికారు. మహిళలు నుదుటిపై తిలకం దిద్ది హారతులు పట్టారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన మేలును వివరించి బుక్‌లెట్ అందజేశారు. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, మారుతీరావు, శ్రీకాంత్, నాయకులు రబ్బానీ, మల్లాపురం నరసింహులు, పులిగొర్ల శ్రీనివాసులు, యక్కలి శేషగిరి రావు, గుంటూరి పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి, మందలపు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

2న ప్రత్యేక సర్వసభ్య సమావేశం

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వచ్చే నెల 2వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. చెన్న కేశవరెడ్డి తెలిపారు. ఐసీడీఎస్‌పై ప్రత్యేక సమీక్ష అనంతరం ఇతర శాఖలపై కూడా సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చకులు చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదమంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కెశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షులు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుదలతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి, పక్కన ఇందిర

మార్కాపురం: విద్యార్థుల నైపుణ్యాల పెంపుదలతో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, వీహెచ్ఆర్ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ సభ్యుడు వెన్న ఇందిర అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ శనివారం ముగిసింది. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు చక్కగా ఉపయోగ పడతాయన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ముఖ్యంగా కంప్యూటర్ సైన్సు విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆటోక్యాడ్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, హెచ్ఓడీలు సాయిబాబా, కందుల రాజశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, పుష్పలత పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కారం



ఎస్ఐ కృష్ణపావనిని సన్మానిస్తున్న దివ్యాంగులు

రాచర్ల: దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.కృష్ణపావని అన్నారు. మండలంలోని ఆకవీడు, సంగోపేట, గుడిమెట్ట, ఒద్దులవాగుపల్లె, అనుములపల్లె, పలుగుంటిపల్లె, రాచర్ల గ్రామాల్లో ఉండే దివ్యాంగులు స్థానిక పోలీసుస్టేషన్‌కు ఇటివల నూతనంగా వచ్చిన ఎస్ఐ జి.కృష్ణపావనిని కలిసి తమ సమస్యలు వివరించారు. అనంతరం ఎస్ఐకు దివ్యాంగులు పూలమాల, శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దివ్యాంగులకు ఇబ్బందులు ఉంటే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇచ్చారు. కె.శ్రీను, షేక్ హనీఫ్, కృష్ణ, శ్రీనివాస గౌడ్, ప్రసాద్, మౌలాలీ, శివరాజ్, నీలవేణి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.